హెర్బల్ మెడిసిన్‌పై పతంజలి యోగ్‌పీఠ్ పరిశోధన

- థైరాయిడ్ నివారణకు థైరోగ్రిట్ ఔషధం తయారీ

సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ): హెర్బల్ మెడిసిన్‌పై పతంజలి యోగ్ పీఠ్ పరిశోధనలు చేస్తోందని, దీని ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు, పరిశోధకులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని ఆచార్య బాలకృష్ణ తెలిపారు. థైరాయిడ్‌పై చేసిన పరిశోధనపై థైరోగ్రిట్ పేరుతో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన జర్నల్‌లో పతంజలి యోగ్ పీఠ్ పరిశోధన ప్రచురితమైందన్నారు. ఈ పరిశోధన ద్వారా వచ్చిన ఫలితాలు థైరాయిడ్ సమస్యలతో బాధపడతున్న కోట్లాది మందికి ఎంతో మేలు చేసేలా ఉంటుందని తెలిపారు. ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్నప్పటికీ పతంజలి యోగ్ పీఠ్ హెర్బల్ మెడిసిన్‌పై చేసిన పరిశోధనలు మంచి ఫలితాలను ఇవ్వడంతో థైరోగ్రిట్ పేరుతో హెర్బల్ మెడిసిన్‌ను రూపొందించామని ఆయన వివరించారు.

జూలై1న గోర్ బంజారా జాతీయ సమ్మేళనం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 26: లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో జూలై 1న గోర్ బంజారా జాతీయ సమ్మేళనం రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు లంబాడీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఎల్ఎస్‌వో) రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు ఎల్ఎస్‌వో ముఖ్య కార్యకర్తల సమావేశం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశానికి అశోక్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గోర్ బోలిని రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూలులో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఎస్‌వో నాయకులు విజేందర్‌పవార్, జగదీశ్‌నాయక్, సంతోష్‌నాయక్, వెంకటేశ్ నాయక్, చందర్, గణేశ్, కిషన్, రాజు, జంపన్న, సురేందర్, రవీందర్ పాల్గొన్నారు.

కులగణన విధి విధానాలను ఖరారు చేయాలి

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తదితరులు

కాచిగూడ,జూన్ 26: రాష్ట్రంలో బీసీ కులగణన ప్రక్రియ చేపట్టడానికి తక్షణమే విధి విధానాలను ఖరారు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం కాచిగూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ కుల సంఘాలు, అభిలపక్ష నేతలతో వెంటనే సమావేశం ఏర్పాటు చేసి, కులగణనపై అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. కులగణన చేపట్టి, బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోని 110 బీసీ కులాల్లో అత్యధిక శాతం నేటికి చట్టసభల్లో ప్రాతినిధ్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కులగణన చేయడం ద్వారా బీసీలకు రాజ్యాధికారంలో వాటా దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సురేశ్, పండరీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి >

గురుకులాల్లో బ్యాక్‌లాగ్ లేకుండా పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ.. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయం సమీపంలో గురుకుల అభ్యర్థులు బుధవారం భిక్షాటన చేశారు.

బాబురావుకు కీర్తి పురస్కారం ప్రదానం చేస్తున్న ఏనుగు నరసింహారెడ్డి, వేదకుమార్ తదితరులు

పురస్కారాలు ప్రదానం..

వసుంధర విజ్ఞాన మండలి 31వ వార్షికోత్సవాలు బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కర్క ముత్తిరెడ్డి స్మారక కవితా పురస్కారాలు, చంద్రమోహన్ స్మారక విద్యా పురస్కారాలు, స్ఫూర్తి పురస్కారాలను ఆయా రంగాల్లో రాణిస్తున్న పలువురికి ప్రదానం చేసి సత్కరించారు. పాత్రికేయ రంగంలో దశాబ్దాలుగా విశేష సేవలందిస్తున్న నమస్తే తెలంగాణ దిన పత్రిక సీనియర్ జర్నలిస్టు బాబురావుకు కీర్తి పురస్కారం ప్రదానం చేసి సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు. ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి, దక్కన్ ల్యాండ్ సంపాదకులు వేదకుమార్, వసుంధర విజ్ఞాన వికాసమండలి వ్యవస్థాపకుడు మధుకర్ వైద్యుల, సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలచారి తదితరులు పాల్గొన్నారు. *– రవీంద్రభారతి, జూన్ 26*

వైద్య కళాశాలలకు నిధులు మంజూరు

- ఉస్మానియాకు రూ.121.90కోట్లు
- గాంధీ మెడికల్ కళాశాలకు రూ.79.50కోట్లు

సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ): నగరంలోని వైద్య కళాశాలల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసింది. గాంధీ, ఉస్మానియా వైద్య కళాశాలల్లోని పలు నిర్మాణ పనులకు మొత్తం రూ.201.4కోట్లను మంజూరు చూస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఉస్మానియా వైద్యకళాశాలకు రూ.121.90కోట్లు, గాంధీ వైద్య కళాశాలకు రూ.79.50కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉస్మానియా వైద్య కళాశాలలో మహిళా వసతి గృహం భవన నిర్మాణానికి రూ.80 కోట్లు, పురుషుల వసతి గృహ నిర్మాణానికి రూ.35కోట్లు, దంత వైద్య విద్యార్థుల వసతి గృహం కోసం రూ.6కోట్లు, ప్రస్తుతం ఉన్న బాయ్స్ హాస్టల్ మరమ్మతుల కోసం రూ.50లక్షలు, ఉస్మానియా వైద్య కళాశాలలోని కృష్ణవేణి లేడీస్ హాస్టల్ ముందు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు రూ.40లక్షల చొప్పున మొత్తం ఉస్మానియా వైద్యకళాశాలకు రూ.121.90కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

గాంధీలో...

గాంధీ వైద్య కళాశాలలో లేడీస్ హాస్టల్ నిర్మాణం కోసం రూ.42కోట్లు, పురుషుల హాస్టల్ నిర్మాణ పనుల కోసం రూ.23 కోట్లు, సీనియర్ రెసిడెంట్స్ బ్లాక్ నిర్మాణ పనుల కోసం రూ.14.50 కోట్ల చొప్పున మొత్తం రూ.79.50 కోట్లను మంజూరు చేశారు. ఈ సందర్భంగా గాంధీ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రమేశ్ రెడ్డి మాట్లాడుతూ... గాంధీ వైద్యకళాశాలలో వైద్య విద్యార్థుల వసతి గృహాల కోసం ప్రభుత్వం చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

సుల్తాన్‌బజార్, జూన్ 26: నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని తెలంగాణ నాల్గవ తరగతి కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ పేర్కొన్నారు. టీఎన్జీవో కేంద్ర సంఘానికి నూతనంగా నియమితులైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యదర్శి ఎస్. విక్రమ్‌కుమార్‌ను తెలంగాణ నాల్గవ తరగతి కేంద్రం సంఘం ప్రతినిధులు బుధవారం ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 1969లో స్వామినాథన్ అధ్యక్షుడిగా కొనసాగిన నాటి నుంచి టీఎన్జీవో కేంద్ర సంఘానికి, తెలంగాణ నాల్గవ తరగతి కేంద్ర సంఘానికి అన్నదమ్ముల అనుబంధం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాల్గవ తరగతి కేంద్ర సంఘం రాష్ట్ర నాయకులు దాస్య నాయక్, ఖాదర్ బిన్ హసన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీని సన్మానిస్తున్న తెలంగాణ నాల్గవ తరగతి కేంద్ర సంఘం ప్రతినిధులు

ప్రభుత్వ పాఠశాలకు 100 బెంచీలు వితరణ

బోరబండలోని ప్రభుత్వ పాఠశాలకు 100 బెంచీలను అందజేసిన చర్మాస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెస్తోంజీ మనువరాలు అనహిత పాట్నీ. *– సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ)*

గ్రేటర్‌కు వర్ష సూచన

సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ): బంగాళఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల మూడు రోజుల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు, మరి కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా నగరంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34.6డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25.4డిగ్రీలు, గాలిలో తేమ 52 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

ఘనంగా 'నర్సింగ్' 61వ వార్షికోత్సవం

సిటీబ్యూరో, జూన్ 26 (నమస్తే తెలంగాణ) : కూకట్‌పల్లిలో బుధవారం ప్రముఖ వస్త్ర దుకాణం 'నర్సింగ్' 61వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నటులు వర్ష, అమీక్ష తదితరులు సందడి చేశారు. 6 దశాబ్దాలుగా వస్త్ర రంగంలో తనదైన ముద్ర వేసుకుని కస్టమర్ల అభిమానాన్ని సొంతం చేసుకుంది. మహానగరంలో 9 షోరూంలు ఉన్నాయి. ఈ సందర్భంగా నర్సింగ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ సింఘానియా మాట్లాడుతూ.. నర్సింగ్ ఒక ఫ్యాషన్ నిధి అని చెప్పారు. అన్ని రకాల డిజైన్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఇంగ్లాండ్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న స్విమ్మర్ గంధం క్వీన్ విక్టోరియా, తదితరులు

ఇంగ్లాండ్‌లో జాతీయ జెండాను.. ఎగురవేసిన స్విమ్మర్ క్వీన్ విక్టోరియా

కాచిగూడ,జూన్ 26: స్విమ్మింగ్ పోటీల్లో తెలంగాణ, బర్మత్‌పుర ప్రాంతానికి చెందిన స్విమ్మర్ గంధం క్వీన్ విక్టోరియా ఇంగ్లాండ్‌లోని డోవర్ కోస్ట్ నుంచి ఫ్రెంచ్ కోస్ట్ వరకు 16 గంటల పాటు రిలే స్విమ్మింగ్ చేసి రికార్డు నెలకొల్పింది. గంధం క్వీన్ విక్టోరియా భారతదేశం తరుపున ఇంగ్లీష్ చానెల్‌ను ఈదడానికి 8 మంది బృందంతో కలిసి ఇంగ్లాండ్‌కు వెళ్లింది. ఈ నెల 24న బ్రిటీష్ కాలమానం ప్రకారం రాత్రి 10 గంటల 46 నిమిషాలకు ఇంగ్లాండ్‌లోని డోవర్ కోస్ట్ నుంచి రిలే స్విమ్మింగ్ ప్రారంభించి 25న సాయంత్రం 4 గంటల 16 నిమిషాలకు ఫ్రాన్స్ దేశంలోని ఫ్రెంచ్ కోస్ట్‌కు చేరుకుంది. ఫ్రాన్స్ దేశాల మధ్య ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రాన్ని ఇంగ్లీష్ చానెల్‌గా పిలుస్తారు. ఇంగ్లీష్ చానెల్‌ను ఈదినందుకు స్విమ్మర్ గంధం క్వీన్ విక్టోరియాను తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు సతీశ్, తదితరులు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే..

సీఎంఆర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్-2024 విజేతలకు బహుమతులు

జూబ్లీహిల్స్, జూన్ 26 : సీఎంఆర్ టెక్స్‌టైల్ అండ్ జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం తమ ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రతి ఏడాది క్రికెట్ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నట్లు సీఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ తెలిపారు. బుధవారం సీఎంఆర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్–2024 విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో ప్రథమ బహుమతి పొందిన గోపాలపట్నం జట్టుకు విన్నర్స్ షీల్డ్‌తో పాటు రూ.1.15 లక్షల నగదు, ద్వితీయ బహుమతి పొందిన ఉప్పల్ జట్టుకు రన్నర్స్ షీల్డ్‌తో పాటు రూ.75 వేలు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.50 వేలు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు రూ.10 వేల నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో సీఎంఆర్ షాపింగ్ మాల్, సీఎంఆర్ జ్యూయలరీ, సీఎంఆర్ సెంట్రల్, సీఎంఆర్ ఫ్యాషన్స్, కంచి కామాక్షి, మావూరి షాపింగ్ మాల్స్ నుంచి 100 టీమ్‌లు.. 1400 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను తిరుపతి, విజయవాడ, ఖమ్మం, హైదరాబాద్, ఒంగోలు, రాజమహేంద్రవరం, విశాఖపట్నం వేదికలుగా నిర్వహించినట్లు తెలిపారు.



తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న కార్టూనిస్టులు మృత్యుంజయ్ తదితరులు

ఉత్తమ కార్టూనిస్టులు, జర్నలిస్టుల అవార్డుల పునరుద్ధరణకు అడుగులు వేయాలి

జూబ్లీహిల్స్, జూన్ 26 : ఉత్తమ కార్టూనిస్టులకు, జర్నలిస్టులకు అవార్డుల పునరుద్ధరణ దిశగా అడుగులు వేయాలని 'ఫోరం ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్.. హైదరాబాద్' ప్రతినిధులు కోరారు. ఇటీవల తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన శ్రీనివాస్ రెడ్డిని ప్రముఖ పొలిటికల్ కార్టూనిస్టులు మృత్యుంజయ్, నర్సిం, శంకర్, జె.వెంకటేశ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తెలంగాణలోని కార్టూనిస్టులు వివిధ పత్రికల్లో వేసిన కార్టూన్లతో సంబంధిత అకాడమీ సౌజన్యంతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని, 1983 లో కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. నాడు ఎన్టీఆర్, ఇతర నాయకులు కూడా వచ్చి అభినందించారని వారు అకాడమీ చైర్మన్‌కు గుర్తు చేశారు. కాగా ఎగ్జిబిషన్ వంటి ప్రోత్సాహక కార్యక్రమాలతో పాటు ఉత్తమ కార్టూనిస్టులకు, జర్నలిస్టులకు అవార్డులు పునరుద్ధరించే విషయమై ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

'మేఫా'తో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒప్పందం

సదస్సులో చర్చిస్తున్న రిజిస్ట్రార్ డా.రఘురామిరెడ్డి తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 26: రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, థాయిలాండ్ స్కూల్ ఆఫ్ ఆగ్రో ఇండస్ట్రీ ఆఫ్ మేఫా యూనివర్సిటీ ప్రొఫెసర్లు మంగళవారం పలు విషయాలపై అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. మేఫా యూనివర్సిటీ చేపడుతున్న పలు అకాడమిక్ కార్యక్రమాల గూర్చి ప్రొఫెసర్ల బృందం చర్చించింది. అవి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతాయని, అందుకు అనుగుణంగా సేవలందించడంలో మేఫా సంస్థల ఒప్పందం హర్షణీయమని వర్సిటీ రిజిస్ట్రార్ డా.రఘురామిరెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. పండ్లు , కూరగాయల పంట కోత అనంతరం టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ , వంటి అంశాల్లో ఉన్న అవకాశాల గూర్చి చర్చించారు. వర్సిటీ విద్యార్థులు, ఫ్యాకల్టీ, ఎక్స్చేంజ్ ప్రోగ్రాం పై ఇరుసంస్థల ప్రతినిధులు మాట్లాడారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ కార్యక్రమాల విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, ఇక్రిశాట్‌కు ఇన్నోవేషన్ హబ్, డిజిటల్ అగ్రికల్చర్ హెడ్ డా. ఆర్. శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్మికులకు రూ.21 వేల వేతనం చెల్లించాలి

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 26 : జిల్లాలోని మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రూ. 21 వేల వేతనాన్ని చెల్లించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు ఎ.అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు గత ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనారోగ్యానికి గురైన, పని చేయలేని స్థితిలో ఉన్నా.. కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. నూతన పీఆర్‌సీలో కనీస వేతనం రూ. 26 వేలు నిర్ణయించాలని, మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, ఉన్నికృష్ణన్, సోమయ్య, స్వప్న, బాలనరసింహ, ఎల్లయ్య, సూరి, మహేశ్, సురేశ్, మధు, పాల్గొన్నారు.

నీట్‌పై నిరసనలు...

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

నారాయణగూడ చౌరస్తాలో మోదీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నేతలు

హిమాయత్‌నగర్, జూన్ 26: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, పీవైఎల్ రాష్ట్ర నేత కృష్ణ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని, నీట్ స్కాం పై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బుధవారం నారాయణగూడ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని రుజువైన కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రం నుంచి 60 వేలకు పైగా విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని, పరీక్ష పేపర్ లీకేజీ వల్ల ప్రతిభవంతులైన విద్యార్థులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ఈ అంశంపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించాలని లేని పక్షంలో ధర్నా చౌక్‌లో మహాదీక్ష చేసి, ఛలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నేతలు వెంకటేశ్, హస్మిబాబు, ఎండి.జావిద్, లెనిన్, సాయి కృష్ణ, అనిల్, స్టాలిన్, శ్రీమాన్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.